

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ పరిధిలో జరుగనున్న 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. - 8లో▸



గవర్నర్‌కు ఘనస్వాగతం

ఖమ్మం నుంచి రోడ్డు మార్గంలో డోర్నకల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న గవర్నర్ తమిళిసైకి బుధవారం కలెక్టర్, ఎస్పీ, అధికారులు ఘన స్వాగతం పలికారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
41.9°/26°

వాతావరణం

ఉదయం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. వడ గాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జూన్ 7 నుంచి ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

జనగామ: మృగశిర కార్తెను పురస్కరించుకుని వచ్చే నెల జూన్ 7, 8, 9 తేదీల్లో పట్టణంలోని సూర్యాపేట రోడ్డులోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి నాగులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్‌లో చేపలు, అక్వా సంబంధిత వంటకాలను జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు తయారు చేసి ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసుకుని విక్రయిస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90637 39554, 99494 38256 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్రీడాకారిణి రుద్రకు సన్మానం



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని అబ్బాస్ అకాడమీ క్రీడాకారిణి బానోత్ రుద్ర మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్(60 కేజీల విభాగం) పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఆమె వచ్చే నెల సిక్కింలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని జాక్ కన్వీనర్ మంగళంపల్లి రాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రుద్రను సన్మానించారు. కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, మహమ్మద్ అబ్బాస్, వీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ్రు ప్రవీణ్, తుంగ కౌశిక్, మహేష్, అజయ్, జాన్సీ, అనుష, కావ్య పాల్గొన్నారు.

‘పాలిసెట్’ ప్రశాంతం

ఏడు సెంటర్లు.. 1,649 మంది హాజరు



జనగామ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఏడు సెంటర్లలో బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష(పాలిసెట్) ప్రశాంతంగా జరిగింది. 1,744 మంది విద్యార్థులకు 1,649 మంది హాజరైనట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ నర్సయ్య తెలిపారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా అవసరమైన వసతులు కల్పించామని చెప్పారు. అన్ని సెంటర్లలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచామని, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను లోనికి అనుమతివ్వలేదని తెలిపారు. యశ్వంతాపూర్‌లోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ శివలింగయ్య విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను తెలుసుకున్నారు.

కుష్ఠురహిత సమాజానికి కృషి

కొడకండ్ల: కుష్ఠు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలని ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సంతోషిలత కోరారు. బుధవారం రాష్ట్ర బృందం ఇంటింటి సర్వేలో భాగంగా 315 గృహాలను సందర్శించి చర్మంపై మొద్దుబారిన మచ్చలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించారు. అనంతరం పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మల్టీడ్రగ్ థెరపీ అందిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చని చెప్పారు. బృందం సభ్యులు లోకేందర్, నర్సింహారెడ్డి, లూర్ధు, అరుణ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్‌కుమార్, మురళి, దేవకి, విజయవర్షిణి, దయాకర్, రమేష్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండవేడి.. వడగాలి



గోనెసంచే గొంగడి..

అల్లాడిపోతున్న జనం

- ఉక్కపోతతో సతమతం
- 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు
- రోడ్డువెంట నీడకోసం వెతుకులాట
- శీతల పానీయాలకు పెరిగిన గిరాకీ


జనగామ: మండుతున్న ఎండలతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విపరీతమైన ఎండవేడికి వడగాలులు తోడవడంతో తల్లడిల్లిపోతున్నారు. ఇంటి నుంచి బయట కాలుపెట్టాలంటేనే భయపడుతున్నారు. బుధవారం జఫర్‌గఢ్‌లో 42.4, తరిగొప్పులలో 38.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం విపరీతంగా పెరుగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మధ్యాహ్నం సమయంలో వాతావరణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. నిల్చున్న చోటే చెమటలు పడుతున్నాయి. నాలుక పిడచకట్టుకుపోతోంది. వ్యాపార, వాణిజ్య సంస్థలతో పాటు ఇళ్లలో ఫ్యాన్లు, కూలర్లు తిరుగుతున్నా వేడిగాలే వస్తోంది. ఉక్కపోతకు తట్టుకోలేక పోతున్నారు. కూలర్లు, ఏసీలకు గిరాకీ పెరిగింది. పనుల నిమిత్తం రోడ్డుపైకి వచ్చిన ప్రజలు శీతల పానీయాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లని తాగునీటితో ఉపశమనం పొందుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, ప్రజలు, పిల్లలు, వృద్ధులు, పశువులు, పెంపుడు జంతువుల రక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



బోసిపోయిన ఫ్లై ఓవర్



దుపట్టాలే రక్షణ..



గర్భిణులు జాగ్రత్తగా ఉండాలి



ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. ఉక్కపోత పెరుగుతోంది. గర్భిణులు డీ హైడ్రేషన్‌కు గురై, ఉమ్మ నీరు తగ్గే అవకాశం ఉంటుంది. నెలవారీ పరీక్షలతో పాటు ఇతర ఇబ్బందులు ఉంటే ఉదయం 9 గంటల లోపు.. సాయంత్రం 5.30 గంటల తర్వాత చెకప్ కోసం ఆస్పత్రికి రావాలి. అత్యవసర సమయంలో బయటకు వస్తే.. వెంట ఓఆర్ఎస్, వాటర్ బాటిల్ ఉంచుకోవాలి. శరీరం వేడెక్కితే తడి వస్త్రంతో ఒళ్లంతా తుడవాలి. పండ్ల రసాలు, మజ్జిగ, వాటర్ ఎక్కువగా తీసుకోవాలి. వడదెబ్బ తగిలిన గర్భిణులు కడుపులో బేబీ కదలికల్లో తేడా అనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.

- డాక్టర్ రజనీ, గైనకాలజిస్ట్, ఎంసీహెచ్, జనగామ



ఎండలో తప్పని ప్రయాణం


శ్రమకు తగిన ఆహారం తీసుకోవాలి



చేసే శ్రమకు తగినట్టుగా రోజూ ఆహారం తీసుకోవాలి. శ్రమ తక్కువ ఉన్నవారు బిర్యానీ, కూల్ డ్రింక్స్ తదితరాలు తీసుకుంటే ఒబేసిటీ, బీపీ, షుగర్ ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. బీపీ, షుగర్ ఉన్న ప్రతి ఒక్కరూ తెల్లవారు జామున వీలైనంత సమయం వ్యాయామం చేయాలి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వేడి తగలకుండా చూసుకోవాలి. ఆపిల్, జామ, మామిడి రసం(సగం గ్లాసు) తీసుకోవచ్చు. రోజుకు ఐదు లీటర్ల వరకు మంచినీరు తాగాలి. ఎండాకాలం కాటన్ దుస్తులు.. వదులుగా ఉన్నవి మాత్రమే ధరించాలి. వృద్ధులు ఇంటి పట్టున ఉంటూ.. శరీరం వేడెక్కకుండా కాపాడుకుంటే ఆరోగ్య సమస్యలు ఉండవు.

- డాక్టర్ వనం శ్రీనివాస్, సివిల్ సర్జన్, స్పెషలిస్టు(డయాబెటాలజిస్టు)

పాడి దిగుబడిపై ప్రభావం



ఎండా కాలం దేశీ, సంకర జాతి పాడి గేదెల నిర్వహణలో జాగ్రత్తలు పాటించక పోతే పాల దిగుబడిపై ప్రభావం చూపుతుంది. పశువులను ఉదయం, సాయంత్రం సమయంలో మాత్రమే మేతకు తీసుకువెళ్లాలి. మధ్యాహ్నం నీడనిచ్చే కొట్టం లేదా చెట్ల కింద ఉంచాలి. పశువులు వేడిని తట్టుకోలేవు. సంకర జాతి పశువులు చాలా ఇబ్బంది పడతాయి. వీటికి అవసరమైతే ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలి. చల్లని శుభ్రమైన తాగు నీరు అందుబాటులో ఉండేలా చూడాలి. మేతలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం ఇస్తే మంచిది. లవణ ఖనిజాలు కలిగిన మినరల్ మిక్చర్ ఇంకా మంచిది. పెంపుడు కుక్కలను ఇంట్లో నీడ పట్టున ఉంచాలి. ఎండ వేడికి వీధి కుక్కలు ఇంటి పరిసరాలకు వస్తే.. నీటితో పాటు ఆహారం అందించాలి.

- డాక్టర్.ఎస్ఎల్.మనోహర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జనగామ

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



ప్రస్తుత పరిస్థితుల్లో ఏడాదిలోపు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. ఎత్తుకుని బయట కూర్చోవద్దు. వేడి గాలి తగలకుండా ముఖం బయట ఉంచి ఒళ్లంతా కాటన్ వస్త్రంతో కప్పి ఉంచాలి. డీహైడ్రేషన్‌కు గురి కాకుండా రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చని నీటితో పిల్లల శరీరం శుభ్రం చేయాలి. వడదెబ్బకు గురైతే పిల్లల బట్టలు విప్పి గోరు వెచ్చని నీటితో తుడవాలి. ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్ లీటరున్నర నీటిలో కలిపి అప్పుడప్పుడూ తాగిస్తూ ఉండాలి. కాసింత నిమ్మరసం కలుపుకోవచ్చు. తల్లి పాలు కూడా ముఖ్యమే.

- డాక్టర్ శంకర్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, ఎంసీహెచ్



వడివడిగా అడుగులు..



తాటి ముంజలు కొనుగోలు చేస్తున్న జనం

ఎండలో బైక్ భద్రం..!

- వాహనం ఎండలో పెట్టారో..పెట్రోల్ హాంఫట్
- టైర్లు పేలడం.. ఇంజన్‌లో మంటలు, మైలేజీ తగ్గే అవకాశం
- సంరక్షణపై సీనియర్ మెకానిక్‌ల సలహాలు

8 లో▸

వడదెబ్బతో నలుగురి మృతి



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డీసీపీ

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- సమీక్షలో కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో డీసీపీ పి.సీతారాంతో కలిసి రోడ్డు సేఫ్టీపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెంబర్తి నుంచి కరుణాపురం వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై ఎనిమిది ప్రమాద స్థలాలను గుర్తించినట్లు చెప్పారు. వ్యతిరేక దిశలో వాహనదారుల రాకపోకలు, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు క్రాస్ చేస్తుండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జనగామ ఆర్టీసీ చౌరస్తా నుంచి లింగాలఘణపురం మండలం నెల్లుట్ల ఫ్లైఓవర్ మీదుగా మొండ్రాయి, పెంబర్తి, చాగల్లు, చిన్నపెండ్యాల, కరుణాపురం, స్టేషన్‌ఘన్‌పూర్, పల్లగుట్ట, రాఘవాపూర్ తదితర గ్రామాల పరిధిలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్‌లు, సైన్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల విభాగం, మున్సిపల్ రోడ్ల విస్తరణ, పోలీస్, రవాణా, ఆర్టీసీ, 108, సంబంధిత శాఖలు సంయుక్తంగా రహదారుల భద్రతపై దృష్టి సారించాలని చెప్పారు. రహదారులపై ఏర్పాటు చేసిన యూటర్న్‌లను మాత్రమే ఉపయోగించేలా ప్రజలకు, ట్రాఫిక్ రూల్స్ పక్కాగా పాటించే విధంగా ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను వెంటనే తొలగించాలని, రోడ్లపై ఉన్న చెక్ డ్యాంలు, చిన్న చిన్న కల్వర్టులకు మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో నేషనల్ హైవే ఈఈ విద్యాసాగర్, ఆర్ అండ్ బీ ఈఈ సీహెచ్. హుస్సేన్, స్టేషన్‌ఘనపూర్, జనగామ ఏసీపీలు రఘుచందర్, దేవేందర్‌రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రజిత, ఆర్టీసీ డీఎం జోత్స్న, పీఆర్ డీఈ, ఎన్‌హెచ్ కన్సల్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 3, 5, 8 తరగతుల్లో గిరిజన విద్యార్థులను చేర్చుకోవడానికి అర్హత గలిగిన ప్రైవేట్ పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2023 వరకు గడిచిన 5 బ్యాచ్‌ల్లో టెన్త్ క్లాస్‌లో 90 శాతం ఉత్తీర్ణత, 50 శాతం ప్రథమ స్థానం ఫలితాలు ఉండాలని పేర్కొన్నారు. ఆర్‌సీసీ భవనం, హాస్టల్ వసతి, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, అన్నిరకాల వసతులు ఉండాలని తెలిపారు. దరఖాస్తు పత్రాలను హనుమకొండలోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 27 లోపు అందజేయాలని సూచించారు.

మెరుగైన రవాణాతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

నర్మెట: సరైన రోడ్డు మార్గాలు.. మెరుగైన రవాణా సదుపాయంతోనే పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మండల కేంద్రం జనగామ రోడ్డు నుంచి ఊరచెరువు మూలమలుపు వరకు 1.2 కిలోమీటర్ల మేర రూ.1.70 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, అక్కడి నుంచి వెల్దండ, కేసిరెడ్డిపల్లి, కొడ్వటూర్ మీదుగా బచ్చన్నపేట వరకు 18 కిలోమీటర్ల(ఏడు మీటర్ల వెడల్పు) రూ.5.30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జనగామ–బచ్చన్నపేట–దుద్దెడ రహదారి మరో రూ.380 కోట్లతో, జనగామ–తరిగొప్పుల–బొత్తలపర్రె వరకు రోడ్లకు కూడా మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రూ.220 కోట్లతో నియోజకవర్గంలోని పలు రోడ్లు మరమ్మతు చేశామని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని బైరోజు జాహ్నవి గీసిన ఎమ్మెల్యే చిత్రపటాన్ని ఆయనకు అందజేయగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌస్, జనగామ మార్కెట్ చైర్మన్ బాల్నె సిద్దిలింగం, ఆర్‌అండ్‌బీ ఈఈ సీహెచ్.హుస్సైన్, డీఈఈ అశోక్‌కుమార్, ఏఈఈ శ్రీశైలం, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కళ్యాణం మురళి, సర్పంచ్‌లు ఆమెడపు కమలాకర్‌రెడ్డి, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వాహనాలకు రిజిస్ట్రేషన్ ఏదీ?

- కొనుగోలు చేసి మూడేళ్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- వాహనాలపై కొరవడిన పర్యవేక్షణ
- ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

జనగామ: మున్సిపల్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి పనుల్లో అక్రమాలు.. నాణ్యతా లోపంతో పరువు పోగొట్టుకున్న పురపాలిక.. ఎంబీ రికార్డుల మాయంపై చివరకు పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కాల్సి వచ్చింది. కనీసం తమ పరిధిలోని వాహన రిజిస్ట్రేషన్లపైనా పట్టింపులేకుండా పోయింది. రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ లేకుండానే వాహనాలతో ఇంటింటికీ చెత్త సేకరణ చేస్తూ.. డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఏళ్ల తరబడి ఆర్టీఏ నిబంధనలు తుంగలోతొక్కి వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు.

మూడేళ్లు దాటినా..

జనగామ మున్సిపల్ పరిధిలో 8 హైడ్రాలిక్ ఆటోలు(నాలుగు చక్రాలు), 8 ట్రాక్టర్లు, ఒక జేసీబీ, ఒక వైకుంఠ రథం, రెండు వాటర్ ట్యాంకర్లు, హ్యాండ్ కట్టర్ మిషన్లు ఉన్నాయి. ఆటోలతో పాటు జేసీబీ (పొక్లెయినర్) తదితర వాహనాలు కొనుగోలు చేసి మూడేళ్లు గడిచి పోతున్నా.. నేటికీ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ చేయించ లేదు. రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్, ట్యాక్స్ చెల్లించిన తర్వాతే వాహనాలను వినియోగించాలి. ఎలాంటి పత్రాలు లేకుండానే చెత్త సేకరణ, మొక్కలకు నీరు పట్టడం తదితర పనులకు రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వాహనాలను వాడుతున్నారు. సాధారణ వాహనాలను నిత్యం తనిఖీ చేసే పోలీసులు మున్సిపాలిటీ వాహనాల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.





రిజిస్ట్రేషన్ లేని మున్సిపల్ వాహనాలు

కొరవడిన పర్యవేక్షణ

పురపాలిక వాహనాలు ఇష్టారీతిన వినియోగిస్తున్న అధికారులు కనీసం వాటి కండీషన్ ఎలా ఉందనే ఆలోచన కూడా చేయడం లేదు. సమయానుకూలంగా సర్వీసింగ్ చేయించకపోవడంతో చెత్త సేకరించే వాహనాలు నడిపే సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు డ్రైవర్లు తెలిపారు.

హైడ్రాలిక్ ఆటోలు	: 8
ట్రాక్టర్లు	: 8
పొక్లెయినర్	: 1
వైకుంఠ రథం	: 1
వాటర్ ట్యాంకర్లు	: 2
హ్యాండ్ కట్టర్	: 1 మిషన్లు

ఆలస్యానికి తప్పదు జరిమానా..

రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపు ఆలస్యమైతే ప్రభుత్వ నిబంధనల మేరకు పెద్ద మొత్తంలో జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మూడేళ్లుగా వాహనాల రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలలకు రూ..1,200 చొప్పున ఏడాదికి రూ.4,800 వరకు ట్యాక్స్ చెల్లించకుంటే ఏటా సుమారు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు జరిమానా పడే అవకాశం ఉంది. ట్యాక్స్ చెల్లింపులు, ఇన్సూరెన్స్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు, ఫైర్ ఆక్సిడెంట్లు జరిగితే.. మున్సిపాలిటీ ఖాతా నుంచి భరించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా.. మున్సిపాలిటీలో పాత వాహనాలు ఉన్నాయి. వాటికి కూడా ఫిట్‌నెస్, ట్యాక్స్, ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయించారా లేదా తెలియాల్సి ఉంది.

బాధ్యత ఎవరిది..?

సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే క్రమంలో చంపక్‌హిల్స్ ప్రాంతంలో ఇటీవల హైడ్రాలిక్ ఆటో ప్రమాదవ శాత్తు కాలిపోయిన విషయం తెలిసిందే. సర్వీసింగ్ లేక పోవడంతో క్లచ్‌ప్లేట్లు హీటెక్కి.. ఆటో పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ ఆటోకు రిజిస్ట్రేషన్ లేదని చెబుతున్న అధికారులు.. కనీసం ఇన్సూరెన్స్ ఉందో లేదో కూడా వారికి తెలియదట. ఇన్సూరెన్స్ లేకుంటే లక్షల రూపాయల ప్రజాధనం బూడిదైనట్టే.

రిజిస్ట్రేషన్ చేయించలేదు..

మున్సిపల్ పరిధిలోని పలు వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించ లేదు. దీనిపై సంబంధిత అధికారులకు గతంలోనే సూచించాం. రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ తదితర నిబంధనలను మరోసారి తనిఖీ చేస్తాం.

- శ్రీనివాసరావు, రవాణాశాఖ అధికారి, జనగామ

ఇన్సూరెన్స్ చేయించాం..

వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించాం. అయితే ఎన్ని వాహనాలకు ఉంది. లేని వాహనాలు ఎన్ని అనే దానిపై పరిశీలిస్తున్నాం. కొత్తగా వచ్చిన ఆటోలు, జేసీబీ, వైకుంఠ రథం వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించాలి. కాలిపోయిన ఆటోకు బీమా ఉంటే అప్లై చేస్తాం.

- చంద్రమౌళి, మున్సిపల్ డీఈ

చెత్త ఏంటి.. మీరేం చేస్తున్నారు

- వీధులన్నీ శుభ్రంగా ఉండాలి
- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించిన కలెక్టర్
- ఖిలాషాపూర్, నిడిగొండ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు

రఘునాథపల్లి: చెత్తా చెదారం ఏంటీ.. తొలగించకుండా ఏం చేస్తున్నారు.. ఇంత అధ్వానమా.. అంటూ కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లెల్లో వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలి.. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శులను ఆయన హెచ్చరించారు. బుధవారం మండల పరిధి ఖిలాషాపూర్, నిడిగొండ గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీధుల్లో అక్కడక్కడా చెత్తా చెదారం పేరుకుపోవడాన్ని చూసి పంచాయతీ కార్యదర్శులను మీరు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. తడి, పొడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయడానికి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌లు మీ నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారాయని మండిపడ్డారు. ఖిలాషాపూర్‌లో విధులను నిర్లక్ష్యం చేసిన పంచాయతీ కార్యదర్శి జ్యోతికి మెమో జారీ చేయాలని డీపీఓను ఆదేశించారు. చెత్తా చెదారం పేరుకు పోవడం వల్ల అపరిశుభ్ర వాతావరణంతో వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. ఈనెల 23 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కార్యదర్శులు బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట డీపీఓ రంగాచారి, ఎంపీడీఓ హసీం, కార్యదర్శులు కవిత, జ్యోతి తదితరులు ఉన్నారు.



నిడిగొండలో పారిశుద్ధ్య పనులపై కార్యదర్శిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

అదనపు కలెక్టర్ పరిశీలన..

లింగాలఘణపురం: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా మండల పరిధి పటేల్‌గూడెం, లింగాలఘణపురం గ్రామాల్లో చేపట్టిన పనులను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బుధవారం పరిశీలించారు. నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్, డంపింగ్ యార్డులను సందర్శించి మొక్కల పెంపకం, చెత్త సేకరణ తదితర అంశాలపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నెల్లుట్లలో డీఆర్‌డీఓ రాంరెడ్డి పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ మల్లికార్జున్, సర్పంచ్‌లు విజయ్‌మనోహర్, చిట్ల స్వరూపరాణిభూపాల్ రెడ్డి, ఎంపీటీసీ భిక్షపతి, ఎంపీఓ సీతారామ నాయుడు తదితరులున్నారు.

క్లుప్తంగా

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష రాయమన్నందుకు ఆత్మహత్య



పెనక వివేక్ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి: ఇంటర్‌లో తప్పిన ఓ విద్యార్థిని సప్లిమెంటరీ పరీక్ష రాయమన్నందుకు మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని వీరపూర్ గ్రామానికి చెందిన పెనక వివేక్(17) ఇంటర్ ఫస్టియర్‌లో ఫెయిలయ్యాడు. ఇంటి వద్ద ఖాళీగా తిరుగుతున్న వివేక్‌ను తల్లిదండ్రులు ఫీజు చెల్లించి సప్లిమెంటరీ పరీక్ష రాయమని చెప్పడంతో మనస్తాపానికి గురైన విద్యార్థి మంగళవారం పురుగు ముందు తాగాడు. తల్లిదండ్రులు గమనించి చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. బుధవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఎండలో బైక్ భద్రం..

- భానుడి ప్రతాపం ఎక్కువ.. పార్కింగ్ స్థలాలు తక్కువ
- వాహనం ఎండలోపెట్టారో.. పెట్రోల్ హాంఫట్
- టైర్లు పేలడం.. ఇంజన్‌లో మంటలు, మైలేజ్ తగ్గే అవకాశం




వరంగల్‌లో రోడ్డు పక్కన ఎండలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ఖిలా వరంగల్: వేసవి కాలం భానుడి ప్రతాపం బెంబేలెత్తిస్తోంది. ఈ తరణంలో మనుషులే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి ఉపశమనం పొందేందుకు మనం అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అయితే మనంవాడే వాహనాల విషయంలో మాత్రం అంతగా శ్రద్ధ వహించం. వరంగల్ ఉమ్మడి జిల్లాతోపాటు నగర వ్యాప్తంగా ఎండలు ఎక్కువ.. పార్కింగ్ స్థలం తక్కువ కనిస్తున్నాయి. దీంతో ప్రధానంగా ద్విచక్రవాహనదారుల జేబులకు చిల్లు లు పడుతున్నాయి. ఇంటి నుంచి ఆఫీసుకు, తిరిగి ఇంటికి వస్తుంటాము.. ఈక్రమంలో మధ్యలో అవసరం వస్తే.. ఏదైనా షాపు ఎదుట పార్కింగ్ చేసి మండుటెండలో బైకులను పార్కింగ్ చేస్తుంటాం. దీంతో ఇంధనం ఎక్కువ ఖర్చు అవుతుండటంతోపాటు తరచూ మరమ్మతులకు గురవుతుంది. దీంతోపాటు మైలేజ్ కూడా తగ్గిపోవడం, కలర్ షేడ్ కావడం, పెట్రోలు ఆవిరైపోవడం, ఇంజన్‌లో మంటలు చెలరేగడం వంటి సమస్యలు ఉంటాయని మెకానిక్‌లు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఉష్ణోగ్రత 40 నుంచి 45 డిగ్రీలతో ఎండలు మండిపోతున్నాయి. ఈనేపథ్యంలో వేసవిలో వాహనానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం..

జాగ్రత్తలు ఇలా..

- వేసవిలో ఎండల వేడికి ఇంజన్ అయిల్ త్వరగా పలుచబడిపోతుంది. నిర్ణీత సమయానికి ఇంజనాయిల్‌ను మార్చుకోవడం మంచిది.
- వాహన పెట్రోలు ట్యాంకుపై మందం కవరు ఉండేలా చూసుకోవాలి.
- సీట్ల కవర్లు సాధారణమైనవైతే అవి వేడెక్కి మన ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.
- ఎండలో వాహనాలు ఎక్కువ సమయం పార్కింగ్ చేయొద్దు.
- ఎండలో దూరప్రయాణం చేయాల్సిన వారు మధ్యలో కాసేపు వాహనాన్ని ఆపాలి.
- వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే నీడలోనే ఉంచాలి.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



వేసవి కాలంలో టైర్లు, ఇంజన్ కండిషన్ చెక్‌చేసుకోవాలి. వాహనాలపై దూరప్రయాణం చేయొద్దు. ఎండ వేడితో ఇంజన్‌లో మంటలు వచ్చే ప్రమాదం ఉంది. ఉదయం 5గంటల నుంచి 10గంటల లోపు.. సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల లోపు ప్రయాణం చేయాలి. రహదారులపై వాహనచోదకులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

- రవీందర్, ఎంవీఐ వరంగల్

వాహనాలను నీడలోనే ఉంచాలి..



వేసవిలో వాహనాలను నీడలోనే పార్కింగ్ చేయాలి. దూర ప్రయాణాలు చేసే వారు ద్విచక్రవాహనాన్ని మధ్యలో ఆపాలి. ఇలా విశ్రాంతి తీసుకోవడం వల్ల బైక్ ఇంజన్ కూల్ అవుతుంది. టైర్లు, ట్యూబులు కండీషన్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో ఎక్కువగా వేగంగా వెళ్లడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. వాహనాల బ్రేకులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలి.

- ఎండీ జాఫర్, సీనియర్ మెకానిక్ ఫోర్టురోడ్ వరంగల్

వాహన రంగు షేడ్ అవుతుంది



మండుటెండలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడం వలన రంగు షేడ్ అవుతోంది. కంప్యూటరైజ్డ్ కెమికల్స్‌తో కూడిన పెయింటింగ్ వాడటం వలన వాటి రంగు త్వరగా పోతుంది. వేసవిలో పగలు కన్నా సాయంత్రం ద్విచక్రవాహనాల్లో పెట్రోలు పట్టించుకోవడం మంచిది. టైర్లో గాలి కొట్టించే విషయంలో ఆలసత్వం ప్రదర్శిస్తే టైర్ల మన్నిక తగ్గిపోతుంది.

- ఎండీ సాథిక్, లక్ష్మీపురం వరంగల్

గవర్నర్‌కు ఘనస్వాగతం..



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ, కలెక్టర్



స్టేషన్‌లోకి వస్తున్న గవర్నర్

- డోర్నకల్‌లో స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ, అధికారులు
- వినతి పత్రాలు అందించిన స్థానికులు

డోర్నకల్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బుధవారం ఖమ్మం నుంచి రోడ్డు మార్గంలో డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని మణుగూర్–బెలగావి ఎక్స్‌ప్రెస్ రైలు ప్రత్యేక బోగీలో సికింద్రాబాద్‌కు వెళ్లారు. గవర్నర్ వాహనం నేరుగా రెండో నంబర్ ప్లాట్‌ఫారం చివరకు చేరుకోగా కలెక్టర్ కె.శశాంక, ఎస్పీ శరత్‌చంద్ర, రైల్వే ఏడీఈఎన్ ప్రకార్‌సింగ్, ఆర్డీఓ కొమరయ్య తదితరులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మొదట ఖమ్మం పర్యటన ముగించుకుని స్థానిక రైల్వే గెస్ట్ హౌస్‌కు వచ్చి అక్కడి నుంచి స్టేషన్‌కు వెళ్తారని భావించిన అధికారులు గెస్ట్‌హౌజ్‌లో గవర్నర్ కోసం ఎదురుచూశారు. కానీ, గవర్నర్ నేరుగా రైల్వే స్టేషన్ వస్తున్నారనే సమాచారంతో అధికారులు స్టేషన్‌కు చేరుకున్నారు. తనను కలిసేందుకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిథులు, స్థానికులను చిరునవ్వుతో పలకరించి బోగీ ద్వారం వద్దకు చేరుకుని నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. వాహనం దిగి రైలు బోగీలోకి వెళ్లడానికి మధ్య గవర్నర్ ఐదు నిమిషాలు మాత్రమే ప్లాట్‌ఫారంపై గడిపారు.

వినతుల స్వీకరణ..

ఆక్రమణకు గురైన ఎండోమెంట్ భూములను పరిరక్షించాలని, మెయిన్ రోడ్డు వెడల్పులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని బీజేపీ నాయకులు కాపరబోయిన సత్యనారాయణ వినతిపత్రం అందించగా డోర్నకల్‌లో పలు రైళ్లకు హాల్టు కల్పించాలని అర్జున యూత్ ప్రతినిధి కొత్త రాంబాబు వినతిపత్రం అందించారు. ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉర్దూ భాషలో ప్రశ్నాపత్రాలు ముద్రించాలని ఎన్‌జీఓ జిల్లా సభ్యుడు అఖిల్‌ఖాన్ కోరారు. రెడ్ క్రాస్ జిల్లా ప్రతినిధులు డాక్టర్ నెహ్రూ రాథోడ్, ప్రసాద్, వెంకటరెడ్డి గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, జిల్లా ఉద్యానశాఖ అధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ అపర్ణ, డీఎస్పీ రమణబాబు, సీఐ వెంకటరత్నం, స్టేషన్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాసరావు, జీఆర్‌పీ సీఐ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఈ బస్సుల విస్తరణ

- కరీంనగర్ జోన్‌కు రానున్న 300 బస్సులు
- అదిలాబాద్ మినహా మిగతా రీజియన్‌లకు ప్రథమ ప్రాధాన్యం



అధికారులతో సమావేశమైన ఆర్టీసీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రవీందర్

హన్మకొండ: నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని రీజియన్‌లో ఈ బస్సులను విస్తరించేందుకు యాజమాన్యం సంకల్పించింది. ఈ క్రమంలో ఆర్టీసీ కరీంనగర్ జోన్‌లోనూ ఈ బస్సులను ప్రవేశ పెట్టేందుకు యాజమాన్యం చర్యలకు పూనుకుంది. ఈ బస్సులు ప్రవేశ పెట్టేందుకు ఏఏ డిపోలు అనువుగా ఉంటాయో గుర్తించే పనిలో యాజమాన్యం, అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ వి.రవీందర్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఆర్టీసీ ఈడీ ఆపరేషన్, సంస్థ కార్యదర్శి మునిశేఖర్, కరీంనగర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.రఘునాథరావు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.జీవన్ ప్రసాద్, వరంగల్ రీజినల్ మేనేజర్ జే.శ్రీలత, కరీంనగర్ ఆర్ఎం డి.సుచరిత, ఖమ్మం ఆర్ఎం ప్రభులత, నిజామాబాద్ ఆర్ఎం టి.ఉషాదేవి, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ముందుగా ఈ బస్సులపై రీజియన్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ బస్సుల వినియోగం, చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనపై రీజియన్ అధికారులకు చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రవీందర్, ఈడీలు వివరించారు. ఈ మేరకు డిపోలు, రూట్‌లు గుర్తించాలని సూచించారు. రాష్ట్ర ఆర్టీసీకి మొత్తం 500 ఎలక్ట్రిక్ బస్సు (ఈ బస్సు)లు రానుండగా ఇందులో కరీంనగర్ జోన్‌కు దశల వారీగా 304 ఈ బస్సులు రానున్నాయి. ఈ బస్సులను కరీంనగర్ జోన్‌లోని అదిలాబాద్ రీజియన్ మినహా, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ రీజియన్‌లో నడుపనున్నారు. ఈ బస్సులు ఒకసారి చార్జింగ్ అయితే 300 కిలో మీటర్ల మేరకు వెళ్లగలుగుతాయి. ఈ మేరకు రూట్లను గుర్తించాలని రీజియన్ అధికారులకు సూచించారు. ప్రధానంగా ప్రథమ ప్రాధాన్యం రీజియన్ హెడ్‌క్వార్టర్‌లోని డిపోలకు ఈ బస్సులు అలాట్ చేయాలనే ఆలోచనలో యాజమాన్యం ఉంది. ఈ మేరకు డిపోలను గుర్తించనున్నారు. ఈ డిపోలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు, ఈ బస్సుల మరమ్మతులు, నిర్వహణ సాధ్యాసాధ్యాలను గుర్తించి డిపోలను ఎంపిక చేస్తారు. ఏడాదిన్నరలో ప్రతి రీజియన్‌కు 70 నుంచి 80 ఎలక్ట్రిక్ బస్సులు చేరుకుంటాయి. వచ్చే సెప్టెంబర్‌లో కొన్ని బస్సులు రానున్నాయి. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఇంధన వ్యయాన్ని తగ్గించేందుకు టీఎస్ ఆర్టీసీ ఈ బస్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ బస్సులకు ప్రయాణీకులకు కాలుష్యరహిత, సురక్షిత, సుఖవంత, మెరుగైన ప్రయాణ అనుభూతి అందించడమే లక్ష్యంగా ఈ బస్సులను ప్రవేశ పెడుతున్నటు ఆర్టీసీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ రవీందర్ తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎంలు బి.కృపాకర్ రెడ్డి, జి.మాధవరావు పాల్గొన్నారు.

సమయపాలన పాటిస్తూ.. పనిచేయండి


- ఉద్యోగుల సమావేశంలో వీసీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ.. కలిసికట్టుగా పనిచేయాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ ఉద్యోగులను కోరారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనా భవనం సెనెట్‌హాల్‌లో రెగ్యులర్ నాన్ టీచింగ్ ఉద్యోగులతోపాటు తాత్కాలిక ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాక్ టీం ఈనెల 25, 26, 27 తేదీల్లో పర్యటించి విభాగాలను పరిశీలించనుందని తెలిపారు. కావున ప్రతి ఉద్యోగి పూర్తిస్థాయిలో సన్నద్ధతతో పనిచేయాలని కోరారు. యూనివర్సిటీ ప్రతి ఒక్క ఉద్యోగికి సంబంధించినదన్నారు. న్యాక్ ఏ గ్రేడ్‌ను సాధించుకునేలా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంచి గ్రేడ్ వస్తేనే యూనివర్సిటీకి ప్రయోజనం కలగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలు తెలుసని, తప్పకుండా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానంగా తాత్కాలిక ఉద్యోగులకు వేతనాల పెంపుదల, 2013 బ్యాచ్ రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి నిలిచిపోయిన పీఆర్‌సీ ఇప్పించేందుకు కృషిచేస్తానని తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు ఆయా సమస్యల పరిష్కారం చేసేలా కృషి జరుగుతుందన్నారు. ఐక్యూ ఏసీ డైరెక్టర్ ఆచార్య నర్సింహాచారి మాట్లాడుతూ న్యాక్ టీం రానున్న నేపథ్యంలో వివిధ విభాగాలను సందర్శించి పరిశీలిస్తున్నామని అయితే పలుచోట్ల విధుల నిర్వహణలో ఉండాల్సిన వారు ఉండటం లేదన్నారు. అంతేగాకుండా ఉద్యోగుల కొరత ఉందని చెబుతున్నారన్నారు. యూనివర్సిటీలో 500 మందికిపైగా అన్నిరకాల ఉద్యోగులు ఉంటారన్నారు. మంచి గ్రేడ్ సాధించాలంటే ఉద్యోగుల పాత్ర కీలకమని స్పష్టం చేశారు. కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారానికి వీసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో వడదెబ్బతో నలుగురి మృతి



ప్రియాంక (ఫైల్)

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండంలోని గవిచర్ల గ్రామంలో ఓ వివాహిత వడదెబ్బతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గవిచర్ల గ్రామానికి చెందిన పాపాని ప్రియాంక(28) ప్రతి రోజూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంది. మంగళవారం సాయంత్రం కూలీ పనికి వెళ్లగా ఎండ వేడిమితో వడదెబ్బకు గురై అస్వస్థతతో సొమ్మసిల్లి పడిపోయింది. వాంతులు, విరేచనాలయ్యాయి, గమనించిన తోటి కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ప్రియాంక పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త వెంకటేశ్వర్లు, 13 నెలల కూతురు రిత్విక ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ దొనికెల రమ కోరారు.


బయ్యారంలో కూలీ..



సీతారాం(ఫైల్)

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో ఓ వ్యవసాయ కూలీ వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని కోడిపుంజులతండాకు చెందిన ఇస్లావత్ సీతారాం(55) మామిడితోటలో కాపలా కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం తోటకాపలా ఉన్న సమయంలో అస్వస్థతకు గురై మృతి చెందాడు.

మానుకోటలో రిక్షావాలా..



రాంజీ(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని బాబా గుట్ట కాలనీకి చెందిన బానోత్ రాంజీ (52) ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై మంగళవారం రాత్రి మృతిచెందాడు. రాంజీ రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం రిక్షా తొక్కుతూ సిమెంట్ బస్తాలు, సిమెంట్ తొట్లు ప్రజలకు చేరవేసి సాయంత్రం ఇంటికి వెళ్లాడు. కొంత సేపటికి అస్వస్థతకు గురయ్యాడు. ఏమి కాదులే అదే తగ్గిపోతుందని కుటుంబ సభ్యులకు చెప్పి అలాగే ఊరుకున్నాడు. నిద్రలోనే రాంజీ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

గుర్తూరులో మత్స్యకారుడు..

తొర్రూరు రూరల్: వడదెబ్బకు గురై ఓ మత్స్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుర్తూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెసరి రాజు(30) అనే మత్స్యకార్మికుడు చేపల వేటకు గుర్తూరు చెరువులోకి వెళ్లి తీవ్ర ఎండకు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ఉష్ణోగ్రతలపై అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లా ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో విద్యుత్ వినియోగం పెరగడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లపై భారం పడుతుందని, అధికారులు, ఉద్యోగులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. రాత్రి సమయంలో షిఫ్ట్ పద్ధతిలో పని చేస్తూ ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌ను అటెండ్ చేయాలని తెలిపారు. డైరెక్టర్లు గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, డీఈ ఐటీ అనిల్ కుమార్, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడను ప్రోత్సహించాలి

- తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి
- వాగ్దేవిలో ఖోఖో అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల వర్క్‌షాపు ప్రారంభం



మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

మామునూరు: గ్రామీణ స్థాయి నుంచే బాలబాలికల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసి ఖోఖో క్రీడను మరింతగా ప్రోత్సహించాలని ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.త్యాగి, తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి సూచించారు. ఈమేరకు బుధవారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ సంఘం అజీజ్ ఖాన్, కార్యదర్శి కైలాస్ యాదవ్, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 16 నుంచి18వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ఖోఖో అంతర్జాతీయ న్యాయ నిర్ణేతల వర్క్‌షాపు బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వారు హాజరై శ్రీలంక, మలేషియా ఖో, ప్రతినిధులతో కలిసి వర్క్‌షాపును ప్రారంభించి, మాట్లాడారు. క్రీడాపోటీల నిర్వహణలో న్యాయ నిర్ణేతల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. కాలానికి అనుగుణంగా న్యాయ నిర్ణేతలు తమ పనితీరుని మెరుగు పర్చుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సెమినార్లు నిర్వహించి ఖోఖో క్రీడ విశిష్టతను తెలియజేయాలని పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ సంఘం, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ ప్రతినిధులు జగరాఘవరెడ్డితోపాటు శ్రీలంక, మలేషియా ప్రతినిధులను సత్కరించారు. ఈ వర్క్‌షాపులో పలు రాష్ట్రాలు, మలేషియా, శ్రీలంక ప్రతినిధులు ఆతుల్లా వాదేకరణే, రుద్రరజణే, పురుషోత్తం, కుమార్‌వాలే, డీవైఎఫ్ హనుమకొండ క్రీడాఅధికారి గుగులోతు ఆశోక్‌కుమార్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ రజవలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి, తోట శ్యాం ప్రసాద్, విజయ్‌కుమార్, సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం



మౌనిక(ఫైల్)

నర్సింహులపేట: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామల వేధింపులతో వివాహిత భూక్యా మౌనిక(28) ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పకీర తండాలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మంగీలాల్ కథనం ప్రకారం.. మానుకోట జిల్లా నర్సింహులపేట మండలం పకీరతండాకు చెందిన భూక్యా వెంకన్న, బుజ్జిల కుమారుడు రాంబాబుతో 11 సంవత్సరాల క్రితం బయ్యారం మండలంలోని చోక్లాతండాకు చెందిన తేజావత్ హస్సేన్ కుమార్తె మౌనికకు వివాహం జరిగింది. ఈక్రమంలో అదనపు కట్నం తేవాలని భర్త, అత్త, మామ వేధించడంతో ఇంట్లోనే మౌనిక పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మౌనికకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి తేజావత్ హస్సేన్ ఫిర్యాదు మేరకు భర్త, అత్త, మామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా మృతురాలి తలపైన బలమైన గాయం కావడంతో రక్తస్రావం జరుగుతుందని, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు



పరీక్షలు వాయిదా వేయాలని వీసీ రమేష్‌ను కోరుతున్న లెక్చరర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరగనున్న పలు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్, బీసీఏ, బీఏ(ఎల్)పీడీసీ కోర్సుల 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. తిరిగి జూన్ 13నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4వ, ఆరో సెమిస్టర్‌ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూల్స్‌ను విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండటంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈనెల 22నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. అయితే ఈషెడ్యూల్‌ను ప్రకటించాక ఈవేసవిలో ఎండలు మండిపోతున్నాయని తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌ను, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు. వీరికి మద్దతుగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ఉన్నారు. ఎండవేడిమి ఎక్కువ ఉందని దీంతో అధ్యాపకులతోపాటు విద్యార్థులకు ఇబ్బంది అని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చివరికి వాయిదావేస్తూ రీ షెడ్యూల్ చేశారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే–జూన్‌లో పూర్తియితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్–జూలైలో జరగబోతున్నందున ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. ఉన్నత విద్యలోని పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లోని ప్రవేశాల ప్రవేశపరీక్షలు అన్ని మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూరిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు.